క్లుప్తంగా

ఆలయంలో ధనుర్మాస పూజలు



పూలతో రూపొందించిన గోదాదేవి అమ్మవారి చిత్రం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న లక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, పూజలు చేపట్టారు. మహిళా భక్తులకు అర్చకులు కుడారై పాయసం అందజేశారు. భక్తులు వివిధ రకాల పూలతో గోదాదేవి అమ్మవారి చిత్రాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. దంపతులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు : నార్తురాజుపాలెంలోని ఎరువుల దుకాణాలను ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, విక్రయాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎరువుల నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తుండడంతో పాటు తగినన్ని నిల్వలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సేకరించిన నమూనాలను నాణ్యతా పరీక్షల నిమిత్తం పంపుతామని వివరించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించినా, నాణ్యతా ప్రమాణాల్లో వ్యత్యాసాలున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను ఎవరైనా ఎక్కువ ధరలకు విక్రయించినట్లు గుర్తిస్తే రైతులు నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని కోరారు.

పేర్నాటికి మద్దతుగా ప్రచారం



ఉపాధ్యాయునికి క్యాలెండర్, కరపత్రం ఇస్తున్న నేతలు

కొడవలూరు : తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని యల్లాయపాలెంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి పట్టభద్రుని ఇంటికి వెళ్లి క్యాలెండర్, కరపత్రాలు ఇచ్చి పేర్నాటిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ఎస్కే.మాబాషా, వెంకటాద్రి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని కాపాడిన పోలీసులు



శీనయ్యను తల్లి చెంతకు చేర్చిన కోవూరు సీఐ

కోవూరు: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి కోవూరు రైల్వే ట్రాక్ వద్ద తిరుగుతుండగా పోలీసులు కాపాడారు. వారి కథనం మేరకు.. కోవూరు గుమ్మళ్లదిబ్బ ప్రాంతానికి చెందిన పూనమల్లి శీనయ్యకు మతిస్థిమితం లేదు. మంగళవారం అర్ధరాత్రి అతను ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు. తల్లి గుర్తించి వెతకడం ప్రారంభించింది. అయితే శీనయ్య ఆచూకీ తెలియరాలేదు. దీంతో కోవూరు పోలీసులను ఆశ్రయించింది. సీఐ కె.రామకృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి శీనయ్యను వెతకడం ప్రారంభించారు. కొందరు సిబ్బందిని రైల్వే స్టేషన్, బస్టాండ్‌లు, జాతీయ రహదారి వద్ద పంపారు. ఈక్రమంలో శీనయ్య రైల్వే ట్రాక్ వద్ద ఉన్నాడన్న సమాచారంతో అక్కడికి వెళ్లి అతడిని తీసుకొచ్చి తల్లికి అప్పగించారు. దీంతో ఆమె పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం

- ప్రజల సంరక్షణ కోసమే జీఓ నంబర్–1
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రాజీవ్ కాలనీలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

ముత్తుకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన జీఓ నంబర్–1పై టీడీపీ, జనసేన తదితర ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరు పంచాయతీలోని రాజీవ్‌నగర్, మధురానగర్, ఆదాలనగర్, రామలింగాపురం, సింహాద్రినగర్‌లో బుధవారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇరుకు సందులు, గొందుల్లో సభలు నిర్వహించడం వల్ల 11 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని విచారం వెలిబుచ్చారు. ప్రచారం కోసం, ఫొటో షూట్‌ల కోసం చంద్రబాబు చేసిన నిర్వాకం వల్ల ఈ ఘోరం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో అమాయక ప్రజల ప్రాణాల సంరక్షణ కోసం ప్రభుత్వం నూతన జీఓను జారీ చేసిందన్నారు. అయితే, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని పదేపదే ఉల్లంఘించే చంద్రబాబు ఈ జీఓ ప్రజాస్వామ్యానికి విరుద్ధమంటూ గగ్గోలు పెట్టడం విచారకరమన్నారు. విశాల మైదానాల్లో, పోలీసుల అనుమతితో సభలు నిర్వహించుకోవాలన్నదే జీఓ ఉద్దేశమన్నారు. కానీ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు, ఈ జీఓను ఉల్లంఘిస్తూ ఇరుకు సందుల్లో సభలు పెడతామంటూ మొండిగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

46 సచివాలయాల పరిధిలో 'గడప గడపకు..' పూర్తి

సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 46 సచివాలయాల పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తి చేశామని మంత్రి కాకాణి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్ల ప్రజలు సంపూర్ణ విశ్వాసం, పూర్తి సంతృప్తితో ఉన్నారని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేయడమే దీనికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు యల్లంగారి వెంకటేశ్వర్లు, షేక్.నవీద్‌బాషా, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, కె.లక్ష్మణరెడ్డి, ముత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు



మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన బ్యాంక్ మేనేజర్, సిబ్బంది

వెంకటాచలం : ప్రజలకు మెరుగైన సేవలు అందించి తద్వారా వారి ఆర్థిక తోడ్పాటుకు సహకరించాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. వెంకటాచలంలోని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ దీపక్, సిబ్బంది బుధవారం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. వెంకటాచలం బ్రాంచ్ ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న సేవల గురించి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు రుణాలు అందించి, ఆర్థిక ఎదుగుదలను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల వ్యక్తులు మాజీ ఉపరాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారు.

సందడిగా ముగ్గుల పోటీలు



పెదపాలెంలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బుజ్జయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.



ఊటుకూరులో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

పెదపాళెంలో..

మండలంలోని పెదపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో సంక్రాంతిని పురస్కరించుకుని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముగ్గుల పోటీల వల్ల విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.ప్రసన్న, ఎంపీటీసీ సభ్యులు బుజ్జమ్మ, వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, స్థానికులు పోలయ్య, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు మనుబోలుకు మంత్రి కాకాణి రాక

మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగనున్న ఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం మండలంలోని అక్కంపేట పంచాయతీలో యువజన దినోత్సవాన్ని ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

తోటపల్లిగూడూరు : మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ పనిచేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి సుందరరాజు పేర్కొన్నారు. మండలంలోని మండపం పంచాయతీ ఈదూరు పట్టపుపాళెంలో మత్స్యకారులకు అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సుందరరాజు మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరుచుకునేందుకు కావాల్సిన సంకేతిక పరిజ్ఞానాన్ని రిలయన్స్ ఫౌండేషన్ అందిస్తోందన్నారు. ముఖ్యంగా వాతావరణం మార్పులను ఎప్పటికప్పుడు వాయిస్ మెసేజ్‌ల ద్వారా మత్స్యకారులకు చేరవేస్తూ అప్రమత్తం చేస్తున్నామన్నారు. వేట సమయంలో మత్స్యకారులకు సహాయ సహకారాలు అందించేందుకు 18004198800 అనే టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. మత్స్యశాఖ సహాయకురాలు సంధ్య మాట్లాడుతూ వేటకు వెళ్లే మత్స్యకారులు విధిగా బోటు రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలన్నారు. బయోమెట్రిక్ కార్డులను పొందాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- కృష్ణపట్నం సీఐ వేమారెడ్డి



రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, పోర్టు సిబ్బంది

ముత్తుకూరు : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని కృష్ణపట్నం సీఐ వేమారెడ్డి అన్నారు. అదానీ కృష్ణపట్నం పోర్టులో బుధవారం జరిగిన రహదారి భద్రత వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తెలిపారు. ఫోర్ వీలర్ డ్రైవింగ్ చేసే వారు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. పరిమితి వేగంతో ప్రయాణం చేయాలని సూచించారు. 70 శాతం రోడ్డు ప్రమాదాల్లో 25 ఏళ్ల వారు మరణిస్తున్నారని చెప్పారు. తలకు బలమైన గాయాలు తగిలిన వారు 87 శాతం మంది చనిపోతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పోర్టు ఆపరేషన్స్ హెడ్ మోహిత్ షెకావత్, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సేఫ్టీ హెడ్ రామకృష్ణ, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కర్, కృష్ణపట్నం ఎస్సై అంజిరెడ్డి పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమణకు గురికాలేదు

తోటపల్లిగూడూరు : కోడూరు సముద్రతీరంలోని అటవీశాఖ భూములు ఆక్రమణలకు గురికాలేదని అటవీశాఖ నెల్లూరు రేంజ్ అధికారి భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరు తీరంలోని సర్వే నంబర్ 1504–ఏలో ఉన్న అటవీశాఖ భూముల నుంచి ఇటీవల కొందరు రైతులు మట్టి తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సిబ్బందితో కలిసి వెళ్లి మట్టి తోలకాలను నిలిపి వేశామన్నారు. అయితే సర్వే నంబర్ 1504–ఏలో దాదాపు పది ఎకరాలను కొందరు ఆక్రమించుకుని రొయ్యల సాగు చేపట్టినట్లు పుకార్లు వస్తున్నాయన్నారు. అయితే ఇందులో వాస్తవం లేదన్నారు. అటవీశాఖ భూముల్లో ఎవరైనా మట్టి తోలకాలు సాగించినా, భూములను ఆక్రమించుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవని భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు.

మత్తులోకి జారుకున్న తల్లి

- రోడ్డుపైకి వెళ్లిన చిన్నారులు
- శిశు గృహానికి తరలించిన ఐసీపీఎస్ అధికారి

నెల్లూరు(క్రైమ్) : ఓ తల్లి మద్యం మత్తులో తన ముగ్గురు పిల్లలను వదిలేసి నిద్రలోకి జారుకోవడంతో ఐసీపీఎస్ అధికారులు సదరు పిల్లలను శిశు సంరక్షణ గృహానికి తరలించిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఐసీపీఎస్, పోలీస్ అధికారుల సమాచారం మేరకు.. కోట మండలం గొనుగుపల్లికి చెందిన గణేష్, చెంచమ్మ దంపతులకు మూడేళ్ల శ్రీనమ్మ, రెండేళ్ల మధు, పది నెలల లక్ష్మి పిల్లలు. భిక్షాటన, చిత్తు కాగితాలను ఏరుకొని రాత్రి వేళ రోడ్లపై నిద్రిస్తుంటారు. ఈ క్రమంలో చెంచమ్మ పూటుగా మద్యాన్ని మంగళవారం సేవించారు. వీఆర్సీ సెంటర్‌లోని ఓ వస్త్ర దుకాణ పక్కన ఉన్న బస్టాండ్‌లో పిల్లలకు పాలు పడుతూ నిద్రలోకి జారుకున్నారు. దీంతో రోడ్డుపైకి పిల్లలు వచ్చి ఆడుకోసాగారు. అటుగా వచ్చే వాహనాలకు అడ్డుపోయారు. అక్కడే ఉన్న జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ విషయాన్ని గమనించారు. పిల్లలను రోడ్డుపై నుంచి పక్కకు తీసుకొచ్చి.. చెంచమ్మను నిద్రలేపేందుకు విఫలయత్నం చేశారు. దీంతో పిల్లలు అక్కడే ఉంటే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించిన సురేష్ తన సిబ్బందిని పిలిపించి ఆటోలో వారిని శిశు సంరక్షణ గృహానికి తరలించారు. అనంతరం విషయాన్ని చిన్నబజార్ పోలీసులకు తెలియజేశారు. బుధవారం నిద్రలేచిన చెంచమ్మకు పిల్లలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించి పోలీసులను ఆశ్రయించారు. శిశు సంరక్షణ గృహంలో పిల్లలున్నారని పోలీసులు చెప్పడంతో ఆమె వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని మయూరి హోటల్ సమీపంలో గల సిటీ యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో గుర్తుతెలియని దుండగుడు చోరీకి బుధవారం తెల్లవారుజామున యత్నించాడు. ఏటీఎం చెస్ట్‌ను తెరిచేందుకు విఫల యత్నం చేశాడు. అలారమ్ మోగడంతో అప్రమత్తమైన చిన్నబజార్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకునేలోపే దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఏటీఎం కేంద్రం, పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా, చోరీకి యత్నించింది పాతనేరస్తుడని తేలింది. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

4కే రన్ ట్రోఫీ ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న 4కే రన్‌కు సంబంధించిన ట్రోఫీని కలెక్టర్ చక్రధర్‌బాబు తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శి నవీన్, శివ, విజయ్, కశ్యప్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



భోగి చుట్టూ సందడి చేస్తున్న విద్యార్థులు

మనుబోలు : సంక్రాంతి పండగను పురస్కరించుకుని మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. గురువారం నుంచి పాఠశాలకు సెలవులు ఉండడంతో విద్యార్థులు సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం భోగి వేసి దాని చుట్టూ పాటలు పాడుతూ సందడి చేశారు. హెచ్ఎం డేవిడ్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపం సంక్రాంతి అని తెలిపారు. విద్యార్థులందరూ తమ కుటుంబాలతో కలిసి సంక్రాంతి వేడుకలను ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే బద్దెవోలులోని ఉజ్వల ప్రైవేటు పాఠశాలలో సంక్రాంతిని పురస్కరించుకుని రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

ఎరువుల ఉత్పత్తితో ఆదాయం పెంపు



ఎరువుల ఉత్పత్తిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వానపాముల ఎరువును ఉత్పత్తి చేయడం ద్వారా పంచాయతీల ఆర్థిక వనరులు పెంచుకోవచ్చని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. కొడవలూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఇక్కడ ఒక పర్యాయం వానపాముల ఎరువు ఉత్పత్తి చేయడం పూర్తి కాగా, తదుపరి ఉత్పత్తి ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీఓ సూచించారు. వానపాముల ఎరువుపై రైతులు ఆసక్తి చూపుతున్నందున విక్రయాల విషయంలో బెంగ అవసరం లేదన్నారు. ఎరువు ఉత్పత్తిని పెంచడం ద్వారా పంచాయతీలు లాభపడాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మనుబోలు విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయినులు

మనుబోలు : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి అండర్–17 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో పదో తరగతి విద్యార్థినులు ఎం.వైష్ణవి, సీహెచ్ శ్రావణి ఉత్తమ ప్రతిభ కనపరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వసంతకుమారి తెలిపారు. వీరు ఈనెల 23వ తేదీ నుంచి విజయనగరంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయిని ప్రమీలారాణి తెలిపారు. శ్రావణి, వైష్ణవిలను బుధవారం పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయినిలతో కలిసి అభినందించారు.

సొంతూరికి వెళ్తుండగా..

- బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో జహంగీర్ మృతదేహం

వెంకటాచలం : మోటార్‌బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వెంకటాచలంలో టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన షేక్ సుభానీ కుమారుడు జహంగీర్ (33) పని నిమిత్తం మోటార్‌బైక్‌లో తిరుపతికి వెళ్లాడు. తిరిగి సొంతూరికి వెళ్తున్నాడు. ఈక్రమంలో టోల్‌ప్లాజా సమీపంలో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో జహంగీర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

14, 15న జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు

తోటపల్లిగూడూరు : మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో ఈనెల 14, 15వ తేదీల్లో జిల్లాస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తిరవళ్లూరు ఈశ్వరయ్య, కదురు వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆల్తూరి ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్‌ల అధినేతలు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఆల్తూరి మహేష్‌రెడ్డి సంయుక్తంగా చెడుగుడు పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. తొలి ఐదు స్థానాల్లో నిలిచిన పురుషుల జట్లకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలను నగదు బహుమతిగా అందిస్తారన్నారు. అలాగే మహిళల జట్లకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలను నగదు బహుమతిగా అందిస్తారన్నారు. అత్యుత్తమ క్రీడా ప్రదర్శన చూపిన క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన సదుపాయంతో పాటు ప్రత్యేక వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 94409 81992, 97046 82519 అనే నంబర్లను సంప్రదించాలని కార్యనిర్వాహకులు తెలిపారు.

ఉద్యోగం దొరక్క.. దొంగగా మారి

నెల్లూరు(క్రైమ్): వైద్య కళాశాల వసతిగృహంలో ఐ ప్యాడ్లను చోరీ చేసిన ఘటనలో నిందితుడ్ని దర్గామిట్ట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బిట్రగుంట మండలం నాగులవరానికి చెందిన ఈశ్వర్ వరుణ్‌తేజ్ డిగ్రీ వరకు చదువుకున్నారు. ఉద్యోగాన్వేషణలో భాగంగా పలు కంపెనీలకు వెళ్లగా, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు అడగడంతో ఉద్యోగం రాలేదు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సైతం అంతంతమాత్రంగా ఉండటంతో దొంగగా మారారు. ఏసీఎస్సార్ వైద్య కళాశాల వసతిగృహంలో ఉంటున్న వైద్య విద్యార్థులు సాయిచంద్రయాదవ్, తౌఫిక్‌కు సంబంధించిన ఐ ప్యాడ్లను ఈ నెల నాలుగున అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసును నమోదు చేశారు. కళాశాల వద్ద సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడ్ని గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. హరిత హోటల్ సమీపంలో నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య తెలిపారు. నిందితుడిపై విశాఖపట్నంలోనూ కేసు ఉందని చెప్పారు.